


పి. ప్రేమచంద్ర

"నాన్నగారూ! నేనొక్కర్తినీ వెళ్లలేనండీ! మీరేమన్నా సరే!"

"అదేమిటమ్మాయ్! గ్రాడ్యుయేటువి. ఇంకా చిన్నపిల్లలా భయమెందుకు? పోనీ తమ్ముడితో కలిసి వెళ్లు"

"వాడా! బాగానే ఉంది. ఏదో సామెత చెప్పినట్లు....వాడొస్తే ఏం లాభం. అంతెందుకు-మీరొస్తేనేగాని నేనసలు వెళ్ల దల్చుకోలేదు" అన్నాను దృఢంగా.

"ఊఁ. అయితే సరే! సెలవు తీసుకుని వస్తానులే తప్పుతుందా తల్లీ మరి! అయినా యీ ఆడపిల్లలు అడుగువేస్తే ఖర్చు, అడుగు తీస్తే ఖర్చు. అడపిల్లకి మరొక పర్యాయ పదం 'డబ్బు ఖర్చు' అని చెప్పొచ్చు" అంటూ నవ్వుతూ వెళ్ళిపోయారు నాన్నగారు

* * *

అసలు దీనికంతటికీ పెద్ద ఉపోద్ఘాతముంది.

నేను డిగ్రీ తీసికొని ఒక ఆరునెలలు ఇంట్లో కూర్చునేనరికి అమ్మలక్కల సంభాషణలలో నేను ఒక అత్యంత ముఖ్య విషయమై కూర్చున్నా "వాళ్ళు అమ్మాయిని ఇంకెంత కాలం అట్టే పెట్టుకుంటారమ్మా!" అని. ఇక ఫ్రెండ్సు కనబడి, "ఏమోయ్! ఏం చేస్తున్నావ్!" అని. ఏం చేయడాని కేముంది— దినాలు గడవక నేను ఛస్తూంటే ఇక మా నాన్నగారితో నేను 'ఉద్యోగమేదైనా చేస్తానండీ' అంటే, "ఇప్పుడేం తొందరమ్మా! ఇంట్లో హాయిగా కూర్చోక!" అంటా రాయన కాని ఇలా పని పాటా లేకుండా కూర్చోడం నాకే కష్టమనిపించి ఒక అప్లికేషను గీసి పడేశాను ఇప్పుడు వాళ్లు నన్ను ఇంటర్వ్యూకి రమ్మని వ్రాశారు ఉద్యోగమంటే ఉరకలు వేసిన మనసు, యీ ఇంటర్వ్యూ కాగితం చూచేసరికి—ఆ ఉరకలు లేవు సరిగదా! ఏదో చెప్పలేని భయం పట్టుకుంది!

వెళ్లవలసిన ఊరు కర్నూలు. ఇంతకు ముందెప్పుడూ అటువైపు ప్రదేశాలకి వెళ్లలేదు చెప్పానుగదూ! ఈ ఇంటర్వ్యూ అనేసరికి గాభరా పట్టుకుంది. ఎందుకంటారేమో, నేను కథలు చాలా చదువుతూ వుంటాను. కొన్ని కథల్లో, కథానాయకులు ఏవో ఇంటర్వ్యూలకి వెళ్ళినట్లు, అక్కడ తీరా తమ పేర్లు పిల్చేసరికి కోటు, పేంటు, టై సరిచేసికొంటూ హడావిడిగా లోనికి వెళ్ళటం, అక్కడ అధికారుల్ని చూస్తూనే వాళ్ళకి వణుకు ప్రారంభమై, నీ పేరేమిటన్న ప్రశ్నకి సహితం 'బ్బెబ్బెబ్బె' అనటం-ఇలాంటివెన్నో చదివాను. ఇప్పుడు నేను కూడా అలాంటి ఇంటర్వ్యూకి వెళ్ళాలనేసరికి, నాకు ఇప్పటినుండే వణుకు ప్రారంభమయిందంటే అందులో విశేష మేమీ ఉండదు. బహుశా అది సైకలాజికల్ ఎఫక్టు అనుకుంటా. దీనికి తోడు మా నాన్నగారు నన్ను ఒంటరిగా వెళ్లమంటే-ఇంక అడిగారూ! అందుకే పట్టుపట్టి మా నాన్నగారిని కూడా నాతో ప్రయాణం చేయించాను.

కథానిక

ప్రయాణం రోజు దగ్గర పడుతూ ఉంది. మా నాన్నగారు 'పేపరు కాస్త

గట్టిగా చదువు అమ్మాయ్! ఏమిటో ఈ కాలం పిల్లలు పేపరు కూడా చదవరు!'' అంటూ సలహాల వర్షం కురిపిస్తూనే ఉన్నారు. రాజమండ్రి స్టేషన్‌లో నన్ను కలుసుకోనమని మా రామికి వ్రాశాను. అన్ని హంగులూ కూర్చుకున్నాను.

కాని ప్రయాణం రోజు ప్రొద్దుట నుండీ ఒకటే వర్షం! తప్పని సరిఅయిన ప్రయాణం, కాబట్టి వర్షంలోనే బయలుదేరాం కాని ఆ వెధవ మెయిల్ ఏరోజైనా సరియైన టైమ్‌కి వస్తేగదూ! పది గంటలకి రావలసినది రెండు గంటలకి వచ్చింది ఇంక, అది వచ్చిన వెంటనే బయలుదేరుతుందా! అంటే, అదీ లేదు వెనక్కు వెళ్లనూ, ముందుకు రానూ ఒక పెట్టె తగిలించుకోనూ, ఒకటి వదలి పెట్టనూ ..''పిల్లికి చెలగాటం, ఎలుకకు ప్రాణ సంకటం'' అన్నట్లు నాకేమో కడుపులో ఒకటే గాభరా అదేదో త్వరగా అయిపోతే ప్రాణం కుదుటపడుతుందిగదా అని (సెలక్టు అవటం, కాకపోవటం అది వేరే సంగతి!) కాని యీ రైలు ఒక పట్టాన కదుల్తేనా!

సరే! ఎలాగైతేనేం, దాని ముహూర్తం కుదిరింది కాబోలు, మెయిల్ స్టేషను విడచి నెమ్మదిగా కదిలింది. రాజమండ్రికి నాలుగు గంటలకు వెళ్లవలసింది ఏడున్నరకి వెళ్ళింది చిన్న తుంపర పడుతూంది చీకటయింది మా రామి ఇంకేమొస్తుంది, పాపం! అది మాత్రం చీకటిలో రావాలంటే కష్టమే మరి· రైలు రాజమండ్రి స్టేషనుకూడా వదలిపెట్టింది మా రామిని చూసిన సర్దాలో ఈ వెధవబెంగ కాస్సేపయినా మర్చిపోయి హాయిగ గడపవచ్చునని ఆశించాను కాని అదీ నిరాశ అయింది. బెజవాడలో రైలు మారాలి కాని మెయిల్ కొరకు ఆగకుండా, మేము ఎక్కవలసిన ఎక్స్‌ప్రెస్ కాస్తా ఉడాయించింది ఇంక మాకు వెయిటింగు రూమే శరణ్యం! ఇంచుమించు నా వయసులోనున్నవాళ్లే నలుగురు అమ్మాయిలు కూడా వచ్చి నాతోపాటే అక్కడ కూర్చున్నారు చూడగా వాళ్లుకూడా కర్నూలు బాపతేమోనన్న అనుమానం వేసింది. వెళ్ళి ఒక్కొక్కర్నీ పలుకరించాను. నా అనుమానం నిజమే అయింది. అనకాపల్లి, సామర్లకోట, ఏలూరు—ఇలా నాల్గు ఊళ్లనుండీ వస్తున్నారట. సరే, తోడుగా ఉంటామనుకుని అంతా స్నేహితులమయి ఏదో బాతాఖానీ వేస్తూ కూర్చున్నాం. ఇంతలో మేము ఎక్కవలసిన బండి వచ్చింది. అందరం ఒకే కంపార్టుమెంటులో ఎక్కాము. గుంటూరులో నా క్లాస్‌మేట్ రమణి కూడా మా కంపార్టుమెంటే ఎక్కింది తానుకూడా ఇంటర్వ్యూకే వస్తుందట రమణిని చూడగానే నా బెంగకాస్త—అంటే ఒక్క డిగ్రీ తగ్గింది

రైలు వెళుతూనే ఉంది ఇంకా ప్రయాణం చేయవలసిన దూరం చాల ఉంది నర్సరావుపేట వెళ్ళేసరికి తెల్లవారింది అక్కడకూడా వర్షం పడుతూనేఉంది మాడగా దేశమంతా వర్షం కురుస్తున్నట్టుంది! కర్నూలు వెళ్ళే దారిలో పెద్దపెద్ద అడవులు, టనల్సు వస్తాయి అని మా నాన్నగారు చెప్పారు అవి రానే వచ్చాయి. ఇంతకు ముందెప్పుడూ అంత పెద్ద అడవులు నేను చూడలేదు క్రిందనుండి వర్ష ప్రవాహం బురద రంగులో ప్రవహిస్తూంటే, ఆ చెట్లన్నీ చూడ ముచ్చటగా ఉన్నాయి. అనకాపల్లి సోదరీమణికి చెట్లపేర్లు బాగా తెలిసినట్టుంది ''అదిగోనండీ! అది వెదురు. అదిగదిగో, అది కరివేపాకు! అబ్బా! ఆ అడ్డాకుల చెట్టు ఎంత పెద్దదిగా ఉందో!' అంటూ వ్యాఖ్యానం సాగించింది నేనుమాత్రం ఒక మూలచేరి కిటికీలోనుండి ఆ రమణీయదృశ్యం చూస్తూ నాలో నేనే ఆనందస్తూ కూర్చున్నా.

ఈ అడవులు దాటింతర్వాత చూడడానికి మరి పచ్చనిముక్క కనబడలేదు అంతా రాతిమయం. అడపా దడపా ఈతచెట్లుమాత్రం కనబడుతూండేవి ఈతచెట్లెందుకు! తగలేసుకోను!! పోనీ వాటిస్థానే ఏ తాటిచెట్లయినా బాగుండును ఇంతలో మా కంపార్టుమెంటులో మొగవాళ్ళు సంభాషణ కుపక్రమించారు. సర్కారు, కృష్ణా, గోదావరి ప్రాంతాలనుండి వచ్చినవాళ్లు ''ఇదేమిటి! ఈ ప్రదేశం గడ్డి కూడ పెరగటంలేదే!'' అని విస్తుపోతూంటే ఆ ప్రాంతాలవాళ్లు ఊరుకుంటారా! ''మాది

రత్నాలమండలం! మేము రత్నాలు పండిస్తాం'' అంటూ ప్రారంభించారు. 'బాగానే ఉంది, రత్నాలవారి సంగతి!' అనుకున్నాను. ఇంకా ఎక్కువ ఆలోచించడానికి మనకు తీరికేది! ఎందుకంటారా, కర్నూలు దగ్గరయ్యేకొలది మన గాభరా మేగ్జిమమ్ పాయింటు రీచ్ అయింది.

ముందు అనుకున్న విధంగానే నేను, మా నాన్నగారు యం. ఎల్. ఏలు బసచేసే రెస్ట్ హౌస్‌కు వెళ్ళాం అక్కడ మనిషి ఒకటింటికి రోజుకు నాలుగురూపాయలు సునాయాసంగా వసూలు చేస్తారు. కావాలంటే మంచినీళ్లు కాసిని ఇస్తారుగాని, అది తప్ప ఏది కావాలన్నా మళ్ళా డబ్బు చెల్లించాల్సిందే! ఆ రాత్రి నాకు భయంకరమైన కలలతో గడచింది అంటే— వాళ్లు ఏవో అర్థం చేసుకోలేని ప్రశ్నలు వేసినట్లు, నేను జవాబు చెప్పలేక బిత్తరపోయినట్లు—ఇలా!

ఎలాగైతేనేం, తెల్లవారింది వాళ్లు హాజరు కమ్మన్న టైమ్‌కి ఒక అరగంట ముందుగానే చేరవలసిన ప్రదేశం చేరుకున్నాం అభ్యర్థులు కూర్చోడానికిగాను ఒకగది ఏర్పాటుచేశారు. ఒక్కొక్కరే వస్తున్నారు నేను ఒక కుర్చీలో కూర్చొని వచ్చేవాళ్ళని చూస్తూ, నేనే ముందు వాళ్ళని ఇంటర్‌వ్యూచేయ నారంభించాను. వయస్సు 21 నుండి 45 వరకు ఉండవచ్చునన్నారుగా! అందుకని పడుచువాళ్లు, వివాహితలు, పిల్లలతల్లులు ఆఖరికి గర్భిణీ స్త్రీలు కూడ వచ్చారు 'ఈ గర్భిణీస్త్రీ ఎలా గ్రామసేవ చేస్తుంది? ఎలా తిరుగుతుంది?' అన్న ఆలోచనలో పడ్డాను ఇంతలో ఒక గుమస్తా వచ్చి ఒక్కొక్కరికి నంబర్లు ఇచ్చి వెళ్ళాడు ఆ నంబర్ల ప్రకారం ఒక్కొక్కరు లోనికి వెళ్ళాలన్నమాట!

మొదట ఒక అమ్మాయి లోనికి వెళ్ళింది. ఇక బైటనున్న వాళ్ల గాభరా చూడండి. సెలక్టింగు కమిటీ ఎంతమందో, ఏ రకం ప్రశ్నలు వేస్తున్నారో అని అన్నీ సందేహాలే! మమ్మల్నందరినీ ఒక అరగంట అలా సందిగ్ధావస్థలో పెట్టి ఆ అమ్మాయి నెమ్మదిగా బయటకు వచ్చింది. బయటకు వచ్చిందో లేదో ఆ పిల్లమీద కాకుల్లా తక్కినవాళ్లు పడ్డారు.

''ఏమడిగారు?''

''రాజకీయాలడిగారా?''

''దేశ్‌ముఖ్ రాజీనామాగూర్చి అడిగారా?''

''వయోజన విద్య గురించేమైనా అడిగారా''—ఇలా ఆ అమ్మాయిని ఉక్కిరి బిక్కిరి చేసి, వీళ్లు ప్రశ్నలు వేయడమే తప్ప, ఆ అమ్మాయిని జవాబులు చెప్పనీయకుండా గడిబిడ చేశారు.

ఇలాగే ఒక్కొక్కరు వెళ్ళివస్తూన్నారు. ఒకరినడిగిన ప్రశ్నలు మరొకరిని అడగటం లేదన్న సంగతి మాకు స్ఫురించినా, లోనికి వెళ్ళి తిరిగి వచ్చిన వారిని ప్రశ్నలడగందే ఉండలేకుండా ఉన్నాము. ఇక్కడ జరుగుతున్న తతంగమంతా చూస్తూంటే, అదేదో ఆస్పత్రిలాగా, ఆపరేషను థియేటరులోకి ఒక్కొక్కరు వెళ్తూన్నట్టు, ఆపరేషన్ అయింతర్వాత తిరిగి వస్తున్నట్లు అనిపించింది

ఇంతలో మా రమణి టర్ను వచ్చింది. ఆవిడ ఇంటర్‌వ్యూ అవగానే నేను ఆదుర్దాగా వెళ్ళి ''ఏమిటడిగారు?'' అన్నాను

అది నవ్వుతూ ''ఏం, చెప్పమంటావ్! వాళ్ళు నా చీర్లమీదపట్టించారు!'' అంది

చీర ఏమిటా అని చూద్దును—నిజమే! వాళ్ళ కళ్ళు దానిమీద పడ్డాయంటే ఆశ్చర్యం లేదు అది షిఫాను చీర. ఒక రంగుకు చెందిందనడానికి వీలులేదు మా తమ్ముడి పదజాలంలో దాన్ని వర్ణించాలంటే– 'అది టెక్నికలర్!'' అన్నమాట. సగం వరకు బగ్గిబగ్గిలుగా గీతలున్నాయి. ఇంకా కాస్తమేర పెద్ద పెద్ద చుక్కలున్నాయి మళ్ళా ఏదో పాముల్లాగా ఉన్నది ఆ చీర చూడ్డానికి కాస్త గాభరాగానే ఉంది.

రమణి చెపుతూంది

ఆ చీరను చూచి—''ఈ చీర నీవు కొనుక్కున్నావా? లేక మీ నాన్న కొన్నారా? ఇది నీ కిష్టమయ్యే కట్టుకున్నావా? లేక కొన్నారు గదా అని కట్టుకున్నావా?'' అని ప్రశ్నలు కురిపించారట. మా రమణి యిలా యిలా

నవ్వుతూ చెప్పేసరికి నాకు కాస్త ధైర్యం వచ్చింది

నా టర్న్ దగ్గరకు వస్తోంది. నేను వీలయినంత మట్టుకు నెర్వెస్‌గా ఫీలవకూడదని, లేదా కనీసం అలా కనిపించ కూడదని గట్టి ప్రయత్నం మీద ఉన్నాను. ఇంతలో నా పేరు పిల్చారు.

లోనికి వెళ్ళాను

అర్ధ చంద్రాకృతిలో కుర్చీలు వేసుకు ఏడుగురు పెద్దమనుష్యులు కూర్చుని ఉన్నారు. వాళ్ళల్లో యిద్దరు స్త్రీలు ఉన్నారు. వాళ్ళను చూడగానే నాకు మరి కాస్త ధైర్యం వచ్చింది

వాళ్ళ ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చున్నాను. అప్పటివరకు లేనిది ఆ క్షణాన్న మరి ఏ దేవుని మహిమోగాని కాస్త ధైర్యం వచ్చిందనే చెప్పాలి.

ఇంగ్లీషులోనే ప్రశ్నలడగటం ప్రారంభించారు.

"నీ పేరేమిటి?"—చెప్పాను.

నేను అప్లికేషనుతోపాటు పంపిన తక్కిన సర్టిఫికేట్లు వాళ్ళముందున్నాయి అందులో ఒకదానిమీద మా కాలేజి ప్రిన్స్‌పాల్ ఏమి వ్రాసిందంటే—"నటనా కౌశల్యం ఉంది. Extra curricular activities లో పాల్గొనేది" అని. వాళ్ళదృష్టి దానిమీదే పడ్డట్టున్నాయి.

"నీవు ఏఏ activities లో పాల్గొనేదానివి?" అని ఒకాయన అడిగారు.

"నాటకాలు వేసేదాన్ని. sports లో పాల్గొనేదాన్ని" అన్నాను.

"ఏం నాటకాలు వేశావు? ఎప్పుడు వేశావు?"

"కాలేజీలో చదివేటప్పుడు వేసేదాన్ని. వాటిలో తీర్పు...."

ఇంకా పూర్తిచేయనేలేదు. అంతలో ఇంకొకాయన అందుకున్నాడు

"ఓహో! అలాగా! ఏం వేషం వేశావు?"

'ఇవేమి ప్రశ్నలురా భగవంతుడా!' అనుకుంటూ—"తీర్పు నాటకంలో జడ్జి భార్యవేషం వేశానండి" అన్నాను.

ఎలాగా వాళ్లు అడగక మానరని ముందే నేను, "ఆవిడ ముందు మూగది. భర్త డాక్టర్ల సహాయంతో బాగుచేయిస్తాడు. ఇక ఆవిడ వాగుడు పిట్ట అవుతుంది. ఆ బాధ భరించలేక ఆ జడ్జీ కావాలని చెవిటివాడుగా అయిపోతాడు" అని టూకీగా కథ గబగబ చెప్పాను.

"ఏదమ్మా! ఏదన్నా ఒక డైలాగు చెప్పు" అన్నాడొకాయన.

'హరి భగవంతుడా! ఇక్కడ డ్రామావెయ్యాల్సిందేనా? వెయ్యనంటే ఉద్యోగం హుళ్లక్కి అవుతుందేమో!' కొద్దిగా ఆలోచించి చిన్న పథకం వేశాను. జవాబు ఆలశ్యమయింది కాబోలు, "సిగ్గుపడకమ్మా! వెయ్యి. ఫర్వాలేదు" అన్నది ఒక స్త్రీ మూర్తి.

"ఎలా వేస్తానండీ! నా భర్త....అంటే జడ్జీగారు ఇక్కడ ఉండాలే!" అన్నాను నవ్వాపుకుంటూ.

వాళ్లుకూడ నవ్వుతున్నారు. అందులో ఒకాయన—గడుసువాడిలా ఉన్నాడు.

"మాలో ఒకర్ని ఎంచుకోమ్మా. లేకుంటే ఆ చైర్‌మన్‌గార్ని నీ జడ్జీగా అనుకుని వెయ్యి." అన్నారు.

హతోస్మి! వాళ్లల్లో ఒకర్నా! ఇంటర్వ్యూ అంటే సగం చచ్చి నేనొస్తే, ఈ ప్రశ్నలతీరు చూచారూ!

సరే అని నేను డైలాగు ప్రారంభించాను.

"ఏమండీ! ఏం చేస్తున్నారు? ఏం చేస్తున్నారో చెప్పరూ నాకు?" అని ఒక ప్రశ్నలాగ వేసి, జవాబుకై నిరీక్షిస్తున్నట్లు చూస్తూ ఊరుకున్నాను. వాళ్లంతా నవ్వుతున్నారు.

"అవును మరి! జడ్జీగారి పోర్షను నాకు రాదుగా!" నవ్వుతూ అన్నారు చైర్‌మన్‌గారు.

ఇంతలో మరొక ప్రశ్న.

"గ్రామీణుల్ని ఆకర్షించడానికి ప్రసంగాలు పనికి వస్తాయా? లేక తీయని పాటా?"

"పాటేనండీ" అన్నాను, 'ఇదేమిటా ఇంత చిన్నప్రశ్న వేశారు' అని అనుకుంటూ.

తరువాతి ప్రశ్న—"నీకు పాటలు వచ్చా?"

ఓహో! అదా సంగతి! అనుకుని—"ఏవో సినిమా పాటలు పాడతానండీ" అన్నాను.

(తరువాయి 36-వ పేజీలో)